## క్లుప్తంగా

### గీజర్ వితరణ


గీజర్‌ను అందజేస్తున్న దాతలు

**కడప కల్చరల్ :** కడప నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోంకు పోరుమామిళ్లకు చెందిన దాతలు సహాయ హస్తం అందజేశారు. గోవిందరాజు, సంధ్యారాణి దంపతులు హోం బాలలకు వేడి నీటి సౌకర్యం కోసం రూ. 9 వేల విలువైన కరెంటు గీజర్‌ను అందజేశారు. దాంతోపాటు హోంలోని చిన్నారులకు స్కూలు బ్యాగులను కూడా అందజేశారు. సంస్థ ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా నారాయణ, శ్రీ చైతన్య, గాయత్రి, ప్రైవేట్ కళాశాలలలో మొత్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం, విద్యార్థి హక్కులను కాలరాయడమేనని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయని విద్యా సంస్థలపై కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం ఆర్‌ఐఓ కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు అకిరానంద్, తేజ, చంద్ర, మస్తాన్, రాజేష్, అశోక్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బైపాస్‌రోడ్డుపై డ్రైనేజీ నీరు


బైపాస్ రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

**కడప కార్పొరేషన్ :** కడప నగరంలోని తిరుపతి బైపాస్ రోడ్డులో రామాంజనేయపురం ఎస్‌బీఐ ఏటీఎం సమీపంలో డ్రైనేజీ కాలువలోని నీరు రోడ్డుపై నిలుస్తున్నాయి. దీనివల్ల బైపాస్ మార్గంలో వెళ్లే ప్రయాణీకులతోపాటు, స్థానిక ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్లప్పుడూ నీరు రోడ్డుపై నిలవడం వల్ల తారు రోడ్డు పాడైపోతోంది. కాలువలో ఎక్కువ పూడిక ఉండటం వల్లే నీరంతా రోడ్డుపైకి చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. అలాగే పైపులైన్ లీకేజీ వల్ల కూడా ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని మరికొందరు చెబుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

### వినతుల స్వీకరణ


ప్రజా సమస్యలను వింటున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

**కడప రూరల్ :** కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి శనివారం స్థానిక ద్వారకానగర్‌లోని తన నివాసంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

**కడప ఎడ్యుకేషన్ :** ప్రభుత్వం విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) జాతీయ కార్యదర్శి షాకీర్ హుస్సేన్, జిల్లా అధ్యక్షులు నజీర్‌బాషలు కోరారు. ఈ విషయమై శనివారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కడపలోని కార్యాలయంలో కలిసి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కలాం, ట్రెజరర్ ఫయాజుర్ రెహమాన్, అన్వర్‌బాష పాల్గొన్నారు.

### ఎర్రచందనం అక్రమ రవాణాను అరికడదాం

**ఖాజీపేట :** ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రొద్దుటూరు రేంజ్ ఎఫ్ఆర్‌ఓ హేమాంజలి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు ఎవ్వరు పాల్పడినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఖాజీపేట మండల పరిధిలోని ఖాజీపేట సెక్షన్, జాండ్లవరం బీట్, నాగసానిపల్లె, పత్తూరు బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమాంజలి మాట్లాడుతూ కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# కిలోల లెక్కన వస్త్ర వ్యాపారం


వైవీ స్ట్రీట్‌లోని ఓ వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల సందడి



ఓ దుకాణం వద్ద 50 శాతం డిస్కౌంట్ సేల్ బోర్డు

- ఆఫర్ల పేరిట వ్యాపారుల జోరు
- మహిళల నుంచి విశేష ఆదరణ

**కడప కల్చరల్ :** కిలో రూ.50... అరకిలో రూ. 30... ఐదు కిలోలు రూ.100.... ఇవన్నీ కూరగాయల రేట్లు. ఇప్పుడు ఈ పద్ధతి వస్త్ర వ్యాపారానికి కూడా తాకింది. కిలో పట్టు చీరలు రూ. 3000కు పైమాటే. అందులో మొదటి రకం రూ. 5000లకు పైగానే. సాధారణ చీరలు కిలో రూ. 2000 వరకు ఇలా సాగుతోంది ప్రస్తుతం ఆషాడ మాసపు వస్త్ర వ్యాపారం. కూరగాయలు, ధాన్యాలకు మాత్రమే పరిమితమైన కిలోల లెక్కన వ్యాపారం ఇప్పుడు కట్టుడు చీరల వద్ద నుంచి పట్టు చీరల వరకు చేరింది. మొన్నటి వరకు బడా షాపింగ్ మాల్స్‌లో ఇస్తుండిన ఈ ఆఫర్లు...నేడు ఓ మోస్తరు వస్త్ర దుకాణాల్లో కూడా సాగుతోంది. క్లియరెన్స్ సేల్స్ పేరిట పాత స్టాకును వదిలించుకునేందుకు 20 రోజుల్లో వివాహాలకు అనువైన శ్రావణమాసం వస్తుండడంతో నూతన స్టాకుకు చోటు కల్పించేందుకు వస్త్ర వ్యాపారులు ఆషాడం పేరిట 20–60 శాతం వరకు ఆఫర్లు ప్రకటిస్తున్నారు. అందులో భాగంగానే కిలోల లెక్కన అమ్మకాలను తెరపైకి తెచ్చారు.

అన్ సీజన్ కావడంతో వ్యాపారాలు లేక వెలవెలబోయిన వస్త్ర దుకాణాలు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. మధ్యలో ఆషాడం అడ్డంకిగా మారింది. మే మాసం నుంచి జులై వరకు మూడు నెలలపాటు బొత్తిగా శుభ ముహూర్తాలు లేకపోవడంతో వస్త్ర వ్యాపారాలు డీలా పడ్డాయి. దీంతో 20 రోజుల్లో రానున్న శ్రావణమాసపు శుభ కార్యాల వ్యాపారం కోసం రకరకాల ఆఫర్లతో కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. ఈ మధ్యలో ఆషాడం ఆఫర్లే వస్త్ర వ్యాపారులను కొద్దిమేర ఆదుకుంటాయి. అన్నింటికీ మించి ఆషాడం ఆఫర్లే ముందు వరుసలో నిలుస్తున్నాయి. ఎటూ ఈ సీజన్‌లో ముస్లింల వివాహాలు ఉంటాయి గనుక ఆఫర్‌లో ఇస్తున్న వస్త్రాలు మరింత ఎక్కువగా అమ్ముడవుతాయి.

**ఆఫర్లే ఆఫర్లు..**

నగరంలో పేరున్న దుకాణాల నుంచి చిన్న స్థాయి వస్త్ర దుకాణాలు సైతం 30 నుంచి 60 శాతం తక్కువ ధరతో ఆఫర్లు ఇస్తున్నారు. ఎక్కువశాతం మంది 60 శాతమే ఆషాడం ఆఫర్‌గా ప్రకటించుకుంటున్నారు. కార్పొరేట్ స్థాయి దుకాణాలు కూడా ఆషాడం ఆఫర్లకు దిగిరాక తప్పడం లేదు. కిలోల చొప్పున చీరలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 20–50 శాతం తక్కువ ధరకు ఇస్తున్నట్లు కరపత్రాలు, దినపత్రికల్లో ప్రచారం చేసుకోవడమేగాక ఈ సంవత్సరం టీవీలలో కూడా ప్రైమ్ టైమ్‌లో ఆఫర్ల ప్రకటనలు ఇస్తున్నారు. లోకల్ ఛానళ్లలో కూడా ఆషాడం ఆఫర్ల ప్రకటనలు వస్తున్నాయి.

**కంపెనీ ఆఫర్లు..**

వస్త్ర వ్యాపారులకు కూడా ఆఫర్లు ఉన్నాయి. వారికి హోల్‌సేల్‌గా వస్త్రాలు ఇచ్చే పెద్ద కంపెనీలు కూడా ఆషాడం కోసం తక్కువ ధరకు స్టాకు ఇస్తారు. హోల్‌సేల్ వ్యాపారులు రీటైలర్లకు డిస్కౌంట్ ఇస్తుండడంతో షోరూం యజమానులు ఆఫర్ల పేరిట తక్కువ ధరకు ఇచ్చినా నష్టం ఉండదని కొందరు వస్త్ర వ్యాపారులు తెలుపుతున్నారు.

## హ్యాండ్‌బాల్ క్రీడలో ఎన్నో విజయాలు

**కడప స్పోర్ట్స్ :** జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటైన యేడాదిలోపు ఎన్నో విజయాలను సొంతం చేసుకుందని ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని మానస ఇన్ హోటల్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కార్యవర్గం ఏర్పాటైన అనతికాలంలోనే జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేశామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ విభాగాల్లో జిల్లా నుంచి 15 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషమన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్‌లు మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజారత్నం ఐజాక్, జనార్ధన్‌రెడ్డి, లావణ్య, నవీన్, కోచ్‌లు అబ్దుల్ మునాఫ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి

## నేడు గురుపూజోత్సవం

**చెన్నూరు :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో చెన్నూరు ప్రధాన రామాలయంలో ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**గోపవరం :** మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## మొహరం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

**పోరుమామిళ్ల(అట్లూరు) :** మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకోవాలని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ తిమోతిలు తెలిపారు. పోరుమామిళ్ల సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మొహరం పండుగ జరుపుకునే కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా అందుకు బాధ్యులుగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ ఐకమత్యంగా పండుగను జరుపుకోవాలన్నారు.

## ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** జిల్లాలో ఆశా కార్యకర్తలపై రాజకీయ నాయకుల వేధింపులను తక్షణం నివారించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవకముందే జిల్లాలో చిరుద్యోగులైన ఆశా కార్యకర్తలను ఉద్యోగాల నుండి తొలగిస్తామని, మీకై మీరే చాలించుకోవాలని లేదంటే మేమే తొలగిస్తామని గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులు, గ్రామ సర్పంచులు అధికార పార్టీ నేతలు ఆశాలను బెదిరిస్తూ తప్పుడు కంప్లైంట్లు చేస్తున్నారని అన్నారు. ఆశా కార్యకర్తలపై జులుం ప్రదర్శిస్తున్న రాజకీయ నాయకులు వేధింపులు మానుకోకపోతే ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశా కార్యకర్తలను తొలగించాలనుకోవడం మూర్ఖత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యు. మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. శాంతమ్మ, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు పి.చంద్రశేఖర్ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సి. అమ్ములు, జిల్లా నాయకురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.

## అడవి ఆవుల మందతో రైతులు బెంబేలు

**కొండాపురం :** మండలలో 15 వేల హెక్టార్లలో సాగు భూమి విస్తీర్ణం ఉంది. వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పొలాల్లో అడవి ఆవులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. బొమ్మేపల్లె, దొంతికోన కొండ ప్రాంతాల్లో గతంలో అడవి ఆవులు నివాసం ఉంటున్నాయి. గతంలో గండికోట జలాశయంలో పూర్తి నీటి సామర్థ్యం పెట్టడంతో ప్రాజెక్టు సమీపంలో ఉండే అడవి ఆవులు పంట పొలాల్లోకి వచ్చి చేరాయి. రాత్రివేళ సాగు చేసిన పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనవారిపల్లె, ఉప్పికాయలపల్లె, కొట్టాలపల్లె, బురుజుపల్లె, కె.సుగుమంచిపల్లె, వెంకటాపురం, బ్రాహ్మణపల్లె, గ్రామాల్లో అడవి ఆవులతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఫారెస్ట్ అధికారులు స్పందించి అడవి ఆవుల బెడద లేకుండా చూడాలన్నారు.


పొలాల్లో సంచరిస్తున్న అడవి ఆవులు

## కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం

**చాపాడు :** మండలంలో కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుంచి ఆగష్టు 2 వరకూ నిర్వహించనున్న జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై నాగులపల్లెలో శనివారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన మచ్చలు, దురద లేని మచ్చలు, మొద్దుబారిన మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వ్యాధిగ్రహస్తులను సకాలంలో గుర్తించి వైద్య సిబ్బంది సేవలు అందించాలన్నారు. రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఏఎన్ఎం మేరి, ఆశా వర్కర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## తన భూమిని పాసు పుస్తకంలో ఎక్కించండి సారూ..


ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు సుబ్బారెడ్డి

**కమలాపురం :** తన 70 సెంట్ల భూమిని పాసు పుస్తకంలో ఎక్కించాలని పలు మార్లు విన్నవించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తన భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని జీవంపేటకు చెందిన రైతు పుత్తా సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. శనివారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబర్ 153లో తనకు 70 సెంట్ల భూమి ఉందన్నారు. అయితే ఆ భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగానని, అయినప్పటికి వారు స్పందించడం లేదని వాపోయాడు. ఎందుకు ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని ప్రశ్నించడంతో రీ సర్వే పెట్టుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇచ్చారన్నారు. రీ సర్వే కొరకు సంబంధిత అధికారులను సంప్రదించగా రీ సర్వే ఆన్‌లైన్ పని చేయడంలేదని వారు చెబుతున్నారన్నారు. తన భూ మిని ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి ఎవరిని అడగాలో, ఏమో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తన 70 సెంట్ల భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని ఆయన కోరుతున్నాడు.

## అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించండి

**బద్వేలు అర్బన్ :** అధికార భాషా సంఘాన్ని సమర్థులతో పునరుద్ధరించాలని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషాభివృద్ధికి స్పష్టమైన విధివిధానాలను ఏర్పాటు చేసి తగినంత నిధులను సమకూర్చి అధికారాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుభాష కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గిడుగురామ్మూర్తి పంతులును ఆదర్శంగా తీసుకుని మాతృభాషను అభివృద్ధి చేసి అచ్చమైన తెలుగువారిగా జీవించాలని ప్రజలను కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోయిన పౌష్టికాహారం

**పులివెందుల రూరల్ :** పులివెందుల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం నిలిచిపోయింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంతోపాటు పాలు కూడా అందిస్తారు. అయితే జూలై నెలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన 3 కేజీల బియ్యం, పోషక విలువలతో కూడిన పదార్థాలు అందలేదని గర్భిణులు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సరైన సమయంలో అందించాలని కోరుతున్నారు.

## మట్కా స్థావరాలపై దాడి

**పులివెందుల రూరల్ :** పులివెందుల ప్రాంతంలో శనివారం మట్కా నిర్వహిస్తున్న వారిపై దాడిచేసి వారి వద్ద నుంచి రూ.1500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డిలు తెలిపారు. మండలం, మున్సిపాలిటీలో ఎవరైనా మట్కా, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రజలు కూడా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

## తల్లికి వందనం ప్రతి విద్యార్థికి ఇవ్వాలి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



**అట్లూరు :** తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ఎంతమంది పిల్లలున్నా అంత మందికి తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒకరికే అనడం దారుణమన్నారు.

అలాగే ఉచితంగా ఇసుక విధానం కూడా అమలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రప్రజలు మరింత వంచనకు గురయ్యే పరిస్థితులే మెండుగా కనపడు తున్నాయన్నారు.

## వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నాబార్డు కృషి


మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి

**కడప కల్చరల్ :** వ్యవసాయంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నాబార్డు సంస్థ ఎంతో కృషి చేస్తోందని సంస్థ జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి అన్నారు. సంస్థ 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ విహారి తొలుత తానే రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులు తమ కార్యాలయానికి విచ్చేసి రక్తదానం చేయడంతో సంస్థకు గౌరవం చేకూరినట్లయిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత ఎక్కువగా రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గ్రామీణ వర్గాల పరిస్థితిని మెరుగు పరచడం, దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో విశేషమైన సహకారాన్ని గుర్తించేందుకు ఈ రోజును అంకితం చేశారన్నారు. స్థిరమైన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించేందుకు నాబార్డు బ్యాంకును స్థాపించారన్నారు. గ్రామీణులకు ప్రయోజనం చేకూర్చే విధానాలు, కార్యక్రమాల అమలులో సంస్థ ముందంజలో ఉందన్నారు. 43 సంవత్సరాలుగా సంస్థ ఎన్నో విజయాల మైలురాళ్లను సాధించిందని వివరించారు. నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ విజయ విహారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను అభినందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదాన ఆవశ్యకత గురించి మరింత విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 25 మందికి పైగా రైతులు రక్తదానం చేశారు. పులివెందుల, ప్రొద్దుటూరు, ఒంటిమిట్ట, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్, సుస్థిర వ్యవసాయ కేంద్రం తదితర ప్రాంతాల నుంచి ఆయా సంస్థల ఉన్నతాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్రీడా పోటీలతో శారీరక, మానసిక ఉల్లాసం

ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసికంగా ఉల్లాసవంతంగా ఉండడమే కాకుండా విధి నిర్వహణలో చురుగ్గా ఉండగలరని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కడప నగర పరిధిలోని స్పోర్ట్స్ స్కూలులో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ స్పోర్ట్స్ మీట్–2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈడీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగిలో ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయన్నారు. ఉద్యోగులు క్రమం తప్పకుండా క్రీడా సాధన చేస్తూ ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా తమ సత్తా చాటగలరన్నారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే పదోన్నతుల్లో కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. అనంతరం ఈడీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డితోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అత్యాధునిక పద్ధతిలో రివిజన్ కీళ్ల మార్పిడి


మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్‌బాష

**కడప రూరల్:** కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల జేబీ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతుల ద్వారా ప్రైమరీ, రివిజన్ కీళ్ల మార్పిడి సర్జరీలను నిర్వహిస్తున్నట్లు కీళ్ల మార్పిడి కీ హోల్ సర్జన్ డాక్టర్ జహంగీర్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతుల గురించి స్పెయిన్ దేశంలోని ఏవో సంస్థ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు అక్కడ శిక్షణతో పాటు మరింతగా ప్రావీణ్యం పొందేలా అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. అక్కడ ఉన్న ఆధునిక వైద్య పరికరాలు, పద్ధతులు జేబీ ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. ఈ ఆపరేషన్లు తమ వద్ద ఉన్న జాన్సన్ అండ్ జాన్సన్ వారి రోబో ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పద్ధతి ద్వారా ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 20 మందికి కీళ్ల మార్పిడి సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జయభారతి అన్నారు. తమ ఆసుపత్రిలో లభిస్తున్న ఆధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, వెంకటేశ్వరుడు, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

## అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

**ప్రొద్దుటూరు :** స్థానిక మున్సిపల్ ఆఫీసులో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు.

శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికుల వద్ద నుంచి పీఎఫ్‌లో తప్పులను సవరిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇటీవల డ్రైవర్లకు రూ.24వేలు వేతనం పెరిగితే వేతనం చేసేందుకు రూ.2వేలు వసూలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. కింది స్థాయి ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ సెక్షన్‌లో ఉన్న వారిని ఆ సెక్షన్‌లోనే విధులకు పంపకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. దీంతో కార్మికులపై పనిభారం పడుతోందని అడిగిన కార్మిక సంఘం నాయకులపై దాడి చేసిన వారిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఓబయ్య, శీను, శివ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

**రాజుపాళెం :** పశువులకు పచ్చి గడ్డి వేయడం వల్ల అధికంగా పాలు ఇవ్వడమేగాకుండా ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని గాదెగూడూరు పశువైద్య అధికారి డాక్టర్ కె.ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం వల్ల పాలల్లో వెన్నశాతం పెరిగి పాడి రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, పిల్లి పెసర, బహువార్షికాలైన సూపర్ నెపియర్, పారాగ్రాస్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

## ప్రత్యేక పూజలు



**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం భక్తులు సామూహికంగా భజనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.